మనస్తత్వం

గొల్లపూడి రాజ్యలక్ష్మి

సాయంత్రం అయిదు గంటలైంది.

ఒక్కొక్కరే కలాలు ముడిచి – ఫైళ్ళు మూసి – బయటకు నిష్క్రమించే హడావుడిలో పడ్డారు. మరో పావుగంటలో – ఆ హాల్లో రామానుజం ఒక్కడే మిగిలాడు. రామానుజానికి టైముతోగానీ, బాహ్య జగత్తుతోగానీ పనిలేదు. ఫైలు తెరిచాడంటే పూర్తిగా పనిలో మునిగిపోతాడు. అంతగా ఆఫీసు పనిలో తాదాత్మ్యం చెందే రామానుజాన్ని చూస్తే ఆఫీసులో మిగతా వాళ్ళకి ఆశ్చర్యం కలుగదు.

రామానుజం ఆ ఆఫీసులో చేరిన కొత్తల్లో మాత్రం. అతనూ తమలాంటి 'సరద లపక్షి' అనుకొని – పార్టీలకు, పిక్నిక్కులకు పిలవటం, ఆఫీసు పని కంటే– కబుర్లకీ ఎక్కువ కాలాన్ని వినియోగిస్తూ – అతన్ని తమ కబుర్లలోకి ఆహ్వానించటం చేశారు. ఒక్క చిరునవ్వుతో – 'అవును' 'కాదు' అనే పొడి మాటలతోనూ – తన ప్రత్యేకతను చూపించి వాళ్ల సాన్నిహిత్యం కంటే – ఆఫీసు పనిమీద తనకు మక్కువ ఎక్కువన్న విషయం వాళ్ళు తెలుసుకొనేలా చేశాడు రామానుజం.

భార్యా – పిల్లలు వున్న రామానుజం – ఆఫీసు టయిము అవగానే ఇంటికి పోవాలని ఏమాత్రం ఉత్సాహం చూపక పోవటం పట్ల – 'అతనితోటి ఉద్యోగస్థులలో రకరకాల అభిప్రాయాలున్నాయి. 'పని' అంటే రామానుజానికి అమిత ప్రాణమనీ, పని చెయటంలో వున్న ఆనందం, ఉత్సాహం మరే విషయంలోనూ అతనికి లభించదనీ కొందరంటే – 'ఇదంతా ప్రమోషన్‌కోసం చేసే స్టంటు!' అని కొందరు వాఖ్యానించుకున్నారు. 'ఇంటిలోని పోరు ఇంతింత కాదయా!' అన్నట్లు భార్య నోరుగలది కావటంవల్ల 'ఇల్లుకంటే ఆఫీసు పదిలమని' ఇక్కడే కాలక్షేపం చేస్తాడని మరి కొందరు అభిప్రాయపడ్డారు. ఈ మాటలన్నీ రామానుజం చెవిని పడకపోలేదు. అయితే అందులో కొన్ని నిజాలు కూడా వుండటంవల్ల అతనంతగా బాధపడలేదు.

రామానుజానికి 'పని అంటే ప్రాణ'మనేమాట నిజమే! 'పెండింగ్' అన్నమాట అతని డిక్షనరీలోనే లేదు. పైగా తన కొలీగ్స్ పని కూడా నెత్తినేసుకుని చేస్తాడు. అతనట్లా పని చేయటంలో ఏదో రిలీఫ్‌ని పొందుతాడు. అందుకే కొందరు 'గానుగెద్దు' అన్నా అదేదో ప్రశంసలాగే అన్పిస్తుందతనికి.

అయితే – రెండో వర్గంవాళ్ళు అభిప్రాయపడ్డట్టు 'ప్రమోషన్' పొందాలనో అతను ఎప్పుడూ ఆశ పెట్టుకుని పని చేయలేదు. తనకంటే సీనియర్స్ వున్నారనీ.... తనకంత సులభంగా రాదని తెలుసు.

ఇంకా మరి కొందరనుకున్నట్లు 'ఇంటిలోని పోరు' మాత్రం నూటికి నూరు పాళ్ళూ నిజం.

రామానుజం భార్య కాంతమ్మ నోరుగలదే మరి!

రామానుజం పెళ్ళయిన కొత్తల్లో – అందరిలాగే అయిదుకాగానే ఫైళ్ళు మూసి – హుషారుగా ఇంటికి పరిగెత్తుకుని వెళ్ళేవాడు. ఇంట్లో కాంతమ్మ ధోరణి చూశాక ఉత్సాహమంతా నీరుకారి పోయేది.

మధ్య తరగతి కుటుంబంలో – ఆరుగురు ఆడపిల్లల్లో ఒక్కగా పుట్టిన కాంతం పెళ్ళి గురించీ – మొగుడ్ని గురించీ చాలానే కలలు కన్నది.

ఇంపాలా కారు కాకపోయినా – కనీసం స్కూటరన్నా వున్న మొగుడు దొరకాలనీ – రోజా పట్టుచీరలు కట్టకపోయినా – కనీసం వంద రూపాయలకు తక్కువగాని చీరలు కట్టుకోవాలనీ....ఏడు వారాల నగలూ లేకపోయినా – ముచ్చటగా మూడు పేటల గొలుసయినా వేసుకోవాలనీ ఎన్నెన్నో కోరికలు! రెండు గదుల కొంపా, కనీసం సైకిలన్నా లేని రామానుజం, వంద రూపాయిల్లో మూడు చీరెలొస్తాయోమో అని తాపత్రయపడే అతని మనస్తత్వం, అతని గుమాస్తా ఉద్యోగంతో – జీవితావసరాలకు కూడా సరిపడని స్థితి ఆమెను నేలమీదకు లాక్కువచ్చాయి. అసంతృప్తి – ఎవరి మీదో తెలీని కసీ, ఆమెను పూర్తిగా వశం చేసుకుని – విచక్షణా జ్ఞానాన్ని పూర్తిగా హరించి వేశాయి. రామానుజాన్ని మాటలతో సాధిస్తూ మానసిక తృప్తి పొందటానికి ప్రయత్నిస్తూంటుంది కాంతం.

ఆ పోరు పడలేక ఇంట్లో వుండే కాలన్ని తగ్గిం-చేసి- ఆఫీసులోనే ఎక్కువగా గడపసాగాడు రామానుజం. బాగా పొద్దు పోయాక ఇంటికొచ్చి- మళ్ళీ ఉదయాన్నే ఇల్లు వదులుత్తాడు.

2

రాత్రి ఎనిమిది గంటలకు ఫైళ్ళు మూసి బయట-కొచ్చాడు రామానుజం. తాపీగా నడుచుకుంటూ ఇల్లుల్ను చేరేసరికి తొమ్మిది అవుతోంది. పెద్ద పిల్ల-లిద్దరూ పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

తండ్రిని చూస్తూనే రెండో వాడు పెద్దగా- "నాన్నా! నరసత్తయ్యా వచ్చింది.!" అని అరిచాడు. అట్లా పెద్దగా అరవటంతో వాడికి వాళ్ళమ్మ పోలికే రావటం రామానుజానికి కాస్త కష్టంగానే అన్పిస్తుంది.

వాడి గొంతువిని వంట గదిలో వున్న కాంతమ్మ, "అదిగో... వచ్చాడమ్మా మీ అన్న. నే చెప్పలేదూ? అందరికీ అయిదు గంటలకే అయిపోయే ఆఫీసు ఇతగాడికి తొమ్మిదవుతేనే కానీ కాదని...! అంతా నా ఖర్మలే! అంటోంది.

రామానుజం బట్టలు మార్చుకుని- పెరట్లోకి కాళ్ళు కడుక్కుని వంటింట్లోకొచ్చాడు.

కాంతమ్మ కుంపట్లో అప్పడాలు కాలుస్తోంది. లక్ష్మీనరుసు వదినగారికి కాస్త దూరంలో పీట మీద కూర్చుని వుంది.

"ఎప్పుడొచ్చావే నరసూ?" అని చెల్లెల్ని పలకరించాడు.

సాయంత్రం నాలుగ్గంటల బండికి!"

"పిల్లలూ వాళ్ళూ బావున్నారా?"

"ఆc... ఏం బావుండటమో! పెద్దదానికి మొన్ననే ప్ళూవచ్చి తగ్గింది. చంటాడికి బంక విరోచనాలయి బక్క చిక్కి పోయాడు. సరే! మీ బావ సంగతి తెలిసిందేగా! ఆ సిగరెట్లు మానరు. రాత్రిళ్ళు ఒకటే దగ్గటం!"

లక్ష్మీనరుసు వచ్చినప్పుడల్లా రామానుజం కుశల ప్రశ్నలు వేయటం- ఆవిడ ప్రపంచంలోని కష్టాలన్నీ తనకే దాపురించినట్లు వాపోవటం- దానితో అన్న-గారు ద్రవించిపోయి- నాల్గు రోజులు విశ్రాంతిగా వుండిపొమ్మనడం మామూలుగా జరిగిపోయే విషయాలు.

"ఊc. నీ వంట్లో ఎట్లావుంది?" అనడిగాడు భయపడుతూనే.

"నా వంటి సంగతే అడిగావ్? నీరసం, గుండెదడ ఎక్కువైనయ్. కాళ్ళ పీకుడు, నడుంనొప్పి నములు-తూనే వుంది! కొత్తగా ఈ కళ్ళజబ్బొకటి పట్టు-కుంది!

కంటి జబ్బా?"

"వూc. ఒకటే కళ్ళంట నీళ్ళు. ఎర్రబడిపోయి- మనుషులు, వస్తువులు ఏవీ కనిపించవు. ఏమిటో... నా ఖర్మలే అన్నయ్యా! ఆయన సంపాదించి పోస్తున్నా సుఖపడే గీత వుండొద్దూ? వదిన సుఖమంతా డబ్బులో నే వుందంటుంది గానీ- అంతా భ్రమ. ఆరోగ్యమే మహాభాగ్యం అని వూరికే అన్నారా? మా కొంపకి 'లక్ష్మీనరుసు నిలయం' అని పెట్టాం-గానీ- 'అనారోగ్య నిలయం' అనిపెడ్తే సరిగ్గా సరిపోతుంది."

"నువ్వెన్నయినా చెప్పు లక్ష్మీ! దరిద్రాన్ని మించిన దరిద్రం మరొకటిలేదు. ఒకటుంటే మరొకటి లేక నే నెంత బాధ పడుతున్నానో నీకేం తెలుసు?"

"నీకేం తక్కువ వదినా! ముత్యాల్లాంటి" మనసులో 'దుక్కల్లాంటి' అనుకుంటూ "పిల్లలు, గంగిగోవులాంటి అన్నయ్య... మరీ చోద్యంగా మాట్లాకు.!"

"నా అదుష్టాన్ని గురించి నువ్వే పొగడాలి! నా ఖర్మకాలి ఈ సంబంధం చేశాడు మా నాన్న! ఒక్క అచ్చటా... ముచ్చటా? ఏం చూసుకుని విర్రవీగాలో చెప్పు! పని మనిషిని పెట్టుకుందామన్నా గతిలేదు. అద్వమైన చాకిరీతో ఛస్తున్నాను. పాలు, అద్దె, కిరాణా అందరికీ బకాయీయే. తెల్లారి లేచిన దగ్గర్నుం ఎవరికో ఒకరికి సర్ది చెప్పటం! మీ అన్నయ్యకేం బాధలేదు. తెల్లారి ఎనిమిది గంటలకే ఇల్లు వదిలి పోతారు. మధ్య నా ప్రాణం పోతోంది. ఇదిగో నరసూ చూస్తుండు. ఈయనతో ఇట్లా కాపురం చేయలేక

ఎప్పుడో కిర్సనాయిలు పోసుకుని అంటించేసుకుంటాను. ఖాయంగా..." అన్నది కాంతమ్మ రామానుజంవైపు కోరగా చూస్తూ.

ఛ అవేంమ్మాటలొ దినా!"

"అంతే నరసూ! నా బాధ నీకు తెలీదు. గొ్రెతోక బెత్తెడన్నట్టు ఎనాళ్లీ సంసారం? నేనా పని చేస్తేగానీ మీ అన్నయ్యకు బుద్ధిరాదు. పెళ్లాం బిడ్డలంటే ఇంత అలక్ష్యమైన మనిషి పెళ్లెందుకమ్మా చేసుకోటం?" కాంతమ్మ విజృంభించసాగింది.

రామానుజం అక్కడ్నించికదలి ముందు గదిలోకెళ్లి వాలుకుర్చీ వేసుకున్నాడు.

"అదిగో... చూశావా? ఎంత నిర్లక్ష్యమో! ఎన్నైనా వాక్కోనీ... అన్నట్టు ఇదీ వరస. ఎందుకమ్మా ఈ పాడు బతుకు? ఎవరికీ కాక పోయాక..." ముక్కు చీదసాగింది కాంతమ్మ.

రామానుజానికి జోలపాట పాడినప్పుడు పసివాడు నిద్రపోయినట్టు– కళ్ల మీదకు నిద్రకూరుకు రాసాగింది.

ఆ విధంగా ఓ అరగంట సాధింపులతో– కళ్లొత్తులతో– ఆడబిడ్డ ఓదార్పులతో గడిచాక– మొగుడ్ని లేపి భోజనం పెట్టింది కాంతమ్మ.

3

ఆ మరునాడు ప్రొద్దున ఆఫీసుకెళ్లే ప్రయత్నంలో వున్న రామానుజం దగ్గరకు లక్షింనరుసు వచ్చి నిలబడి ఏదో చెప్పటానికి తటపటాయిస్తోంది.

ఏవిఁటన్నట్టు చూశాడు.

"మరీ... మధ్యాహ్నం నేను వూరికి వెళ్తున్నా నన్నయ్యా!" అని ఆగింది.

'అప్పుడే... వెళ్లిపోతుందా? ఈ సారిఎక్కువ రోజులు వుండదల్చుకోలేదా? ఎందుకొచ్చిందో? ఏదైనా పని పెట్టుకుందా తనతో?' ఆలోచిస్తున్నాడు.

మనస్తత్వం

మొదటి నుంచీ ముభావంగా వుండే మనస్తత్వం అన్నయ్యది. నాలుగు ప్రశ్నలకి కలిపి ఒకటే జవాబిస్తాడు. అందుకే ఏం మాట్లాడాలన్నా ఏదో బెరుగ్గా– భయంగా వుంటుంది. అబ్బ! వదినకెంత ధైర్యం!.. ఎన్నేసి మాటలంటుంది!... కట్టుకున్న మొగుడన్న లక్ష్యంలేదు కదా?" అనుకుంటోంది లక్ష్మీనరుసు.

"ఊఁ... కళ్ళు బాలేదన్నావ్‌గా. డాక్టర్‌కి చూపించుకో! అశ్రద్ధ చేయకు అన్నాడు ముందుకు కదులుతూ రామానుజం.

"అన్నయ్యా మరి."

ఆగాడు.

వంట గదిలోంచి ముందు గది గుమ్మంలో కొచ్చి నిలబడి వీళ్ల సంభాషణ వింటోంది కాంతమ్మ. 'డబ్బుగానీ అడగదు కదా!' అన్న అనుమానం కల్గింది రామానుజానికి. కాస్తో కూస్తో కలిగిన కుటుంబమే అయినా వచ్చినప్పుడల్లా తిరుగు ప్రయాణానికి ఛార్జీలు అన్నగారి దగ్గర పుచ్చుకుపోవటం లక్షింనర్సుకు అలవాటే.

'జేబు తడుముకున్నాడు రామానుజం. అయిదు రూపాయలు మాత్రం మిగిలి వున్నాయి. అసలే నెలాఖరు రోజులు. కాంతం కాఫీ పొడి అయిపోయిందన్నది. ఓ పావుకిలో తీసుకు రావాలి....

రెండో కొడుకు గోపాలం వున్నట్టుండి ఓ గావుకేక పెట్టాడు.

"నాన్నోయ్!"

ఝుడుసుకుని– 'ఏవిఁట్రా' అన్నట్టు చూశాడు.

"నాకో రూపాయి కావాలి! డబల్‌రూళ్ల పుస్తకం కొనుక్కోవాలి!"

"జీతాలు రానీయ్!" అన్నాడు.

"ఇవాళే కావాలి!"

"నా దగ్గరలేవు. అమ్మనడుగు." పొరపాట్న నోరుజారాడు.

కాంతంకు ఒళ్ళు మండింది. "అమ్మనడగాలిట. అమ్మని! అక్కడికి వందలు– వందలు గడించి నా చేతుల్లో పోస్తున్నట్టు! ఆ మాటనటానికి సిగ్గుండాలి!" అన్నది ఛీదరింపుగా.

రామానుజం ఆ మాటల్ని విననట్లే చెల్లెలి ముఖంలోకి చూశాడు. 'ఏమిటో విషయం త్వరగా చెప్పు!" అన్నట్టు.

గోపాలం "నాన్నా! రూపాయి..." అన్నాడు వదిలిపెట్టకుండా

'తప్పదు. రూపాయి ఇస్తేగానీ వదలడు శని వెధవ. ఈ పిల్లలక్కూడా అన్నీ తల్లిలా పీడించుకుతినే బుద్ధులే!" అని లోలోన విసుక్కుంటూ జేబులో చెయ్యిపెట్టాడు.

"ఒరేయ్ గోపీ! రూపాయి నేనిస్తాన్లే. నాన్నకాఫీసు టయిం అయింది. వెళ్లనీ అన్నది లక్షింనరుసు.

అది ఆమె స్వభావానికే విరుద్ధమైన మాట. ఎన్నడూ తన పిల్లలచేతిలో పైసా పెట్టి ఎరుగదు. పోనీ వచ్చేటప్పుడైనా ఓ పండైనా తెచ్చి ఇవ్వటం అలవాటులేదు. వున్నట్టుండి ఇంత ఉదారత ఏమిటా అని ఆశ్చర్యం వేసింది రామానుజానికి. ఏదో బలీయమైన పనే తనతో వుండి వుంటుంది అనుకున్నాడు. కాంతం అక్కడున్నంత సేపూ లక్షింనరుసు నోరు విప్పదని అర్థమై నాలుగడుగులు ముందుకు వేసి రోడ్డు మీద కొచ్చాడు. తండ్రిని వెన్నంటి నడవబోతున్న గోపాలాన్ని కసిరింది లక్షింనరుసు– తను చెప్పబోయే విషయానికి అడుగడుగునా విఘ్నం కలగటం చూసి.

"రూపాయి నేనిస్తా నన్నాగదా! నాన్నని విసిగిస్తావేం?" అని.

"వాడేం చేశాడమ్మా పసి వెధవ. నువ్వేగా ఏదో మాట్లాడాలని మీ అన్నని నిలేశావు. నన్ను చూసి కాబోలు అన్నా చెల్లెళ్ల రహస్యాలు ఆగిపోయాయి. అన్నది విసురుగా.

"నీకు తెలీని రహస్యాలేమున్నాయి వదినా! మధ్యాహ్నం వూరికెళ్తున్నానని చెప్తున్నాను." అన్నది ముఖం మాడ్చుకుని.

"ఎందుకమ్మా ఆ బుకాయింపు? ఆ మాత్రం నేను గ్రహించలేని దాన్నికాదు. మీ అన్నయ్యతో ఏ పనీ బడకుండా– వూరికే ఆపేక్షతో చూసి పోదామని వచ్చావా?" అన్నది నిలదీస్తూ.

లక్ష్మీంనర్సు ముఖం పాలిపోయింది.

రామానుజం వెళ్లాలా.. వద్దా.. అన్నట్టు ఇరకాటంలో పడ్డాడు.

గోపాలం "నాన్నా..." అంటూ నసపెడుతున్నాడు.

"బావుందొ దినా! అయితే మా అన్నయ్య మీద నాకు ఆపేక్ష లేదంటావ్! అయితే ఎందుకొచ్చానంటావ్ ఇప్పుడు? తినటానికి నాకేం గతిలేక వచ్చానంటావా?"



అన్నది ముఖాన గంటు పెట్టుకుని లక్ష్మింనర్సు.

"అంతమాట నే నెందుకంటాను తల్లీ! ఏం రాచ-కార్యమో... చెప్తేనేగా తెలిసేది?" అని మొగుడుకేసి తిరిగి "ఇదిగో.. నిన్నే! వచ్చేప్పుడు కూరలు పట్టుకురా! నాలుగు రోజుల్నుంచి పచ్చడి మెతు-కులతో ఛస్తున్నాం!" అన్నది. "ఆఁ... అన్నట్టు కాఫీ పొడి సంగతి మర్చి పోకు!" అన్నది పెద్దగా.

'నెలాఖరు...' నసిగాడు.

"అయితే? ఎన్నాళ్ళిలా మాడి చావమంటావు? రాత్రి తొమ్మిది దాకా ఆఫీసులో బండచాకిరీ చేసే బదులు- ఇంకో చోట పద్దులు రాస్తే... నాలుగు డబ్బులైనా వస్తాయి. సంపాయించే బుర్ర వుండాలి-గానీ..."

"ఇదిగో కాంతం... ఇది వీధి. వూరికే అరవకు!" అన్నాడు కాస్త చిరాకుగా." ఈ చిరాకులకేం తక్కువ-లేదు. సంబడం! రారా గోపీ... ఈ వెధవ సంసారానికి తోడు మీ పుస్తకాల గోలొకటి! వెధవ సంతా మీరూను...." అంటూ కొడుకుని అక్కడ్నించి బరబరా లాక్కు పోబోయింది కాంతమ్మ.

రామానుజం తన జేబులోని అయిదు రూపాయిల్లో ఒకటి చేతిలో పెట్టి- రోడ్డు మీద కొచ్చాడు. అన్నగారితో పాటు తను కూడా అడు-గులువేస్తూ- మెల్లని స్వరంతో అన్నది లక్ష్మింనర్సు.

"వారం నుంచి రేణు కన్పించటం లేదన్నయ్యా! అది మీ ఇంటికేమన్నా వచ్చిందేమో అని... ఆశతో వచ్చాను!"

రామానుజం ఆగి ఆశ్చర్యంగా- కాస్త కంగారుగా చూశాడు.

"రేణు కన్పించటంలేదా? ఏం జరిగిం దసలు?" అన్నాడు ఆదుర్దాగా.

"ష్. మెల్లిగా. వదినిక్కడే వుంది. విన్నదంటే... నా కొంప బజార్న పెడుతుంది. నీతో ఈ ముక్క చెప్పాలనే రాత్రినించీ ప్రయత్నం! ఏమిటో నా ఖర్మ! నా బాధ పగవాళ్ళకు కూడా వొద్దు. ఈడొచ్చిన పిల్ల ఇట్లా... ఎంత అప్రదిష్ట! దానికేదైనా జరిగితే నేను నూతిలో పడటంతప్ప మరో దారిలేదు!" గొంతు రుద్ధమైపోయింది. ముక్కు చీదుకుంది.

రామానుజం చెల్లెలివంక సానుభూతిగా చూశాడు.

"దిగులుపడకు. ఎక్కడో వుండే వుంటుంది. దాని స్నేహితుల ఇళ్ళు వెతికావా?"

"అంతా చూశాం. నా ఖర్మ ఇదంతా! టెన్త్ కాగానే కాలేజీలో చేరుతానంది. మీ బావ వొప్పుకోక 'పెళ్ళి' అన్నారు. అది దానికిష్టంలేదు. జరిగిందింతే! ఈ మాత్రానికే ఇట్లా చేయాలా? చెప్పు!"

"దానికి బాయ్ ఫ్రెండ్స్ ఎవరైనా...?"

"ఛ.. అట్లాంటి బుద్ధులు మా ఇంటావంటాలేవు. రేణు గుణమేమిటో నీకు తెలీదా?"

"మరికనేం? ఎందుకు కంగారు? ఈపాటికి ఇల్లు చేరేవుంటుందేమో! పోనీ... నేను శలవుపెట్టి నీక్కూడా రానా?" అనడిగాడు.

"వద్దులే! కన్నందుకు మాకు తప్పదు. నీకూడా ఎందుకొచ్చిన బాధ!"

"సర్లే ఇంటికెళ్ళాక అదొచ్చిందీ- లేనిదీ ఉత్తరం రాయి. అవసరమైతే వస్తాను. సరేనా? నేనింక వెళ్ళాలి." మరోసారి వాచీ వైపు చూసుకుని బస్ స్టాప్ వైపు పరుగు తీశాడు ఆదుర్దాగా.

తిరిగొస్తున్న లక్ష్మింనర్సుని చూసి- కాంతమ్మ అక్కసుగా మూతి విరుచుకుంది.

"ఆ బుద్ధులు ఎక్కడికి పోతాయి? అన్నకు తగ్గ చెల్లెలే! మనసులో ఏముంటుందో.. ఒక్క విషయం తనతో ఆంతర్యంగా చెప్పరు! ఎంతయినా తను పరాయిదే! పాడు సంత! తను నోరు పారెసుకోవడం మాత్రం కన్పిస్తుంది!" అనుకుంది రుసరుసగా.

4

రాత్రి రామానుజం వచ్చేసరికి కాంతమ్మ తలకు గుడ్డ కట్టుకుని పడుకునివుంది. మౌనంగా స్నానం-చేసి వచ్చి తనేవడ్డించుకుని తినసాగాడు రామానుజం.

అంతా చూస్తూనే వుంది కాంతమ్మ. ఒళ్ళు మండుకొచ్చి లేచింది.

కేశవర్ధిని...
పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం

పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనే

అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్దిచుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

అరు నెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.

కేశవర్ధిని
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ (మద్రాసు)
మద్రాసు-600 092

OBM 8473 TG

"నేను చచ్చిన్నాడు కూడా నువ్విట్లాగే స్నానం-చేసి- హాయిగా తింటావు కాబోలు! 'ఎందుకలా పడుకున్నావు?' అనైనా అడగనివాడికి నీ కసలు పెళ్ళెందుకయ్యా? ఏం కొంపలో పడేశావురా తండ్రీ! నేనీ కాపురం చేయలేనురా దేవుడా!" కాంతమ్మ అరవటం మొదలెట్టింది.

అప్పటిదాకా చదువుతున్న పిల్లలు పుస్తకాలు మూసి ఈ భాగోతం తిలకిస్తూ కూర్చున్నారు.

"ఛ అవేం మాటలు?" అన్నాడు నోట్లోని ముద్ద మింగుతూ.

"లేకపోతే ఏవిఁటి? తిన్నానో – వున్నానో నీ కక్కర్లేక పోయాక..."

"ఊఁ... అన్నం తిన్నావా?" అడిగాడు. మొక్కు-బడిగా.

"ఆవో... ఏం ప్రేమ!... అన్నట్టు కాఫీ పొడి తెచ్చావా?"

"లక్ష్మినర్సు వెళ్ళిందా?" మాట మార్చాడు.

"వెళ్ళింది. అవునూ... ఎందుకొచ్చిందిట? వీధిలో కంటావచ్చి ఏవిఁటి చెప్పింది?" అనడిగింది కుతూ-హలంగా

"ఏంలేదు."

"ఏం లేదూ? ఎందుకా అబద్దాలు? పెళ్ళాంతో కూడా చెప్పగూడని రహస్యమా."

"ఏంలేదు అన్నాగా!"

"చెప్పవన్నమాట! ఎంతమొండి మనిషి! నేనింక ఈ కొంపలో ఒక్క క్షణం వుండను! ఈ పిల్లలతో ఎట్లా వేగుతావో నీ ఇష్టం! నే పోతున్నా!

"ఎక్కడికి?"

"ఎట్లోకి! నీకూ – నీ పిల్లకూ చాకిరీ చేసే పని మనిషిని కాను నేను. అతీ – గతీ లేనట్టు ఈ కొంపలో పడి వుండాల్సిన ఖర్మ నాకేమిటి? పోతా మా ఇంటికి!"

"ఇదేగా నీ ఇల్లు!" అన్నాడు, చెయ్యి కడుక్కొని లేచి.

"ఇది నాఇల్లా? .... అవునూ.... కాఫీ పొడి తెచ్చావా? అంటే మాట్లాడవేం?

"రేపు తెస్తాను. ఇవాళ టైం దొరకలేదు!"

"నేను పోయాకగానీ నీకు టైము దొరకదు! ఎందు-కొచ్చిన పాడు జన్మ....ఛి, ఛీ.!"

"వూరుకో కాంతం! అసలే నీకు తలనొప్పిలా వుంది! కాస్త ఎంగిలి పడు." అన్నాడు ముంచు గదిలో కెళ్తూ.

"నీ ఆపేక్ష మండినట్లే వుందిలే! ఇదిగో.... దీపావళి వస్తోందికదా.... పిల్లలకి ఈ సారైనా బట్టలు తీసేదుందా?"

"మరో నెలాగుత్తే సంక్రాంతి వస్తోందిగా! దీనికి ఇద్దాంలే!.... నీకు చీరె కూడా...., సరేనా?"

"ఇదుగో.... ముందే చెప్తున్నా! నాకు మాత్రం పట్టుచీర తీసుకోవాల్సిందే! పెళ్ళయి పదిహేనేళ్లు గాటినా.... నా గోడు నాకేగానీ...."

"చూద్దాం లే!" అన్నాడు నీరసంగా.

"ఏవేటంట చూసేది? ఈసారి పట్టుచీరె కొనక-పోతే.... ఈ దరిద్రపు కొంపలో ఒక్క క్షణం కూడా వుండను. అయినా.... నా ముఖానికి అంత దురుష్టం కూడానా? దానికైనా పెట్టిపుట్టాలి. మగాడికి సంపాదించే యావ..... పెళ్ళాం బిడ్డల్ని సుఖపెట్టా-లన్న యావ స్వతహాగా వుండాలిగానీ.... ఎంతపోరితే మాత్రం ఏం లాభం? గానుగెద్దులా పడి ఆఫీసులో చాకిరీచేసి, రావడం, తినడం, తొంగోటం! నెలకొచ్చే ఆ రొందలూ ఎట్లా సర్దాలో తెలిక నేను తలబద్దలు చేసుకుంటున్నాగానీ నీకు చీమ కుట్టినట్టయినా వుండదు. ఈ చాలీచాలని జీతంతో ఎప్పటికి బ్రతుకు తెల్లవారేను? ఎదుగూ – బొదుగూలేని ఈ దరిద్రపు ఉద్యోగం....అన్నట్టు... బోనసేదో వస్తుం-దన్నారుగా?" కాంతమ్మ హార్ష్యవాహం ఆపి రామానుజం వైపు చూసింది. అప్పటికే మంచం మీద పడుకుని గుర్రెట్టి నిద్రపోతున్నాడు కాంతమ్మకు మళ్ళీ ఒళ్ళు మండింది. చేతిలోని పులుసు గిన్నె తీసుకెళ్ళి అతని నెత్తినే దిమ్మరించి రావాలన్నంత కోపం వచ్చింది. బలవంతాన అన్నం ముద్దలతో పాటు కోపాన్ని దిగమింగింది.

5

"అయ్‌గారు పిలుస్తున్నారు సార్!" ప్యూన్ అప్పన్న చెప్పాడు.

"ఆఁ. వస్తున్నా!" అంటూ హడావిడిగా లేచి లోపలికెళ్ళాడు.

"ఆ ఫైలు పూర్తయిందా?"

"ఆ పనే చేస్తున్నాను సార్! ఇంకో పది నిము-షాల్లో తెచ్చిస్తాను!" అన్నాడు వినయంగా.

"కూర్చో. నిలబడే వున్నావేం?" అన్నాడాయన కళ్ళజోడులోంచి నిశితంగా చూస్తూ.

"ఫర్వాలేదులెండి!" అన్నాడు ఇబ్బందిగా. "అరె.... కూర్చోమంటుంటే ఎందుకామొహమాటం...."

కూర్చున్నాడు.

"నీకెంతమంది పిల్లలయ్యా రామానుజం?"

"నాకాండి....ఇద్దరు మగ....ఇద్దరు ఆడ."

"వెరసి నలుగురన్నమాట! భేష్. బాగుందోయ్. ఇదిగో... అప్పన్నా! రెండు కాఫీలు పట్రా!" అని కేకేశాడు.

రామానుజానికి ఆయన వైఖరి కొత్తగానూ – వింతగానూ తోచింది. 'ఏవిఁటి ఆకాల ఆప్యాయత? తనకి పెళ్ళిదొచ్చిన మగపిల్లలు గట్రా లేరే! తనతో ఈయనకి ముఖ్యమైన పనులేముంటాయబ్బా!' అన్న ఆలోచనలో పడ్డాడు.

అప్పన్న కాఫీలు తెచ్చాక రామానుజానికొకటిచ్చి – తనొకటి తీసుకున్నాడు. మొహమాట పడుతూనే కప్పు తీసుకున్నాడు.

"ఊఁ....మిష్టర్ రామానుజం! నీకో గుడ్ న్యూసోయ్!" అన్నాడు పళ్ళన్నీ బైటపెట్టి నవ్వుతూ.

"అయ్యా.... తమదయ!" అన్నాడు తబ్బిబ్బు-పడుతూ. పవిఁటా వార్త అన్నట్టు చూశాడు.

"మన కంపెనీకి ఈ మధ్య చాలా లాభాలు వస్తున్నాయి. చాలాచోట్లనుంచి ఆర్డర్స్ వస్తు-న్నాయి. అందుకే కొత్తగా మరో బ్రాంచి పెట్టాలని మన మెనేజిమెంట్ నిశ్చయించుకుంది. అందుకు సమర్థుడైన వ్యక్తిని మన ఆఫీసులోంచి ఎన్నికచేసి – ఆ బ్రాంచికి మేనేజర్‌గా ఎపాయింట్ చేయాల్సి వుంటుంది." ఆగాడాయన.

రామానుజం శ్రద్ధగా వింటున్నాడు.

"నేను.... అందుకు నిన్ను సమర్థుడిగా రికమండ్ చేశాను. పనిమీద నీకున్న శ్రద్ధ నన్నెంతగానో ఆకర్షించింది. ఏ కంపెనీ అయినా నిజాయితీగా పని చేయగల స్టాఫ్ వున్నప్పుడే వృద్ధిలోకి వస్తుంది. నీ ఆధ్వర్యంలో పెట్టబోయే బ్రాంచి విజయవంత-మవుతుందని ఆశిస్తున్నాను! ఇవాళో – రేపో నీకు ఆర్డర్సు వస్తాయి."

అది కలో – నిజమో అర్థంకాలేదు రామానుజానికి.

'తనకేమిటి.... బ్రాంచి మేనేజరుగా ప్రమోష-నేమిటి? ఇది కలే అయివుండాలి!' అనుకున్నాడు.

"కంగ్రాట్యులేషన్ అందుకోండి!" అన్నాడాయన రామానుజం అవస్థ చూసి నవ్వుతూ.

"థాంక్యూ.... థాంక్యూ సార్!" అన్నాడు తేరుకుని.

క్షణాల్లో ఈ వార్త ఆఫీసంతా పాకింది. స్టాఫంతా వచ్చి అభినందించిపోతున్నారు. చేతిలో పైసా లేకున్నా – అడ్వాన్సుగా అందరికీ కాఫీలు పోయించక తప్పలేదు రామానుజానికి.

మనసులో అంతులేని ఆనందం.... ఏదో తెలిని బెంగ పోటీపడినయ్. నిశ్చలమైన తటాకంలో రాయి విసిరినట్టుంది అతని పరిస్థితి

'బ్రాంచి మేనేజర్ అంటే సామాన్యమా? ఎంత హోదా.... ఎంత పలుకుబడి? పైగా జీతంలో పెరుగు-దల! తను ఎప్పుడైనా అనుకున్నాడా? ఈ స్థాయిలోనే ఇట్లాగే ఎప్పుడో రిటైరయిపోతాననుకున్నాడు. ఈ జీవితానికింతే! అని ఎప్పుడో రాజీపడిపోయాడు. ఇప్పుడింత నమ్మకంతో తనపై ఈ బాధ్యత అప్ప-గిస్తున్నారు! తను నిర్వహించగలడా?' ఆలోచన-లతో సతమతమైపోతున్నాడు రామానుజం.

రోజులా రాత్రి ఎనిమిది గంటలదాకా ఆఫీసు పనిలో లీనం కాలేకపోయాడు. అందరితో పాటు అయిదు గంటలకే ఫైలుమూసి బైటకు నడుస్తున్న రామాను-జాన్ని చాలా కళ్ళు ఆశ్చర్యంతో చూశాయి.

6

"అమ్మా! నాన్నొచ్చాడేవ్!" అంటూ గోపీ పెద్ద-పెట్టున వేసిన కేక విని – దొడ్లో పక్కింటావిడతో గోడ దగ్గర నిలబడి మాట్లాడుతున్న కాంతమ్మ – "ఎవరూ? మీ నాన్నే?" అన్నది అపనమ్మకంగా. రామానుజం కాళ్ళు కడుక్కోటానికి పెరట్లోకి

రావటం చూసి ఆశ్చర్యంతో కొయ్యబారిపోయింది.

"ఏమిటి ఈ వేళప్పుడు వచ్చావు? ఒంటో బాగో-లేదా?" అనడిగింది.

"బాగానే వుంది." అన్నాడు.

"మరి?"

"ఏమీలేదు...మనసు బాగోలేదు!" ముఖం తుడుచుకుంటూ. అన్నాడు.

"ఏం జరిగిందేమిటి?"

"ముందు నా ముఖాన కాఫీ నీళ్ళుంటే పొయ్యి!" అన్నాడు కాస్త విసుగ్గా – కాంతమ్మ మరింత తెల్ల-బోయింది

"ఏం జరిగిందీయనకు? కొంపదీసి గాలిగాని సోక-లేదుకదా!' అనుకుని – "కాఫీపొడి అయిపోయిందని నెత్తి – నోరూ కొట్టుకుని చెప్పినా తెస్తేగా? కాఫీ పొయ్యాలిట! కాఫీ! సిగ్గెట్టా లేదనీ...." మొదలు పెట్టింది సాధింపు.

"ఆఁ... అన్నట్టు నాచేతి సంచిలో – కాఫీపొడి, పూలువున్నాయి చూడు!" అన్నాడు గుర్తొచ్చి.

"ఏమిటీ? పూలే! ఈవేళ సూర్యుడు ఏ దిక్కున పొడిచాడబ్బా! అన్నది ముఖం విప్పారగా.

అయిదు నిమిషాల్లో కాఫీ తయారు చేసు-కొచ్చింది.

కాఫీ గ్లాసు అందుకుని తాగుతూ – "ఈవేళ ఓ విశేషం జరిగింది." అన్నాడు కాంతమ్మ ముఖంలోకి చూస్తూ.

"ఏమిటో అది? బోనసుగానీ ఇచ్చారేమిటి?" అన్నది ఆశగా.

"కాదు....నాకు ఉద్యోగంలో మార్పు వచ్చింది!"

నిట్టూర్చింది. "సంబడం. ఇంతేనా? ఇంకా ఏమో అనుకున్నాను. అద్సరే.... మీ చెల్లెలు ఉత్తరం రాసింది. ఆ గూట్లో వుంది చూడు!" అంటూ అక్కడ్నించి పోబోయింది.

"ఏం రాసింది?" అన్నాడు కార్డు తీసి చూస్తూ.

"ఎదురుగానే వుందిగా. చదవరాదూ?"

"నే చెప్పేది పూర్తిగా వినకుండా వెళ్తావేం?"

"ఏం వినాలి సొద?"

"నీకు శుభ వార్తేలే! నాకు ప్రమోషన్ వచ్చింది!" అన్నాడు నవ్వుతూ.

కాంతమ్మ ముఖంలో విసుగు మాయమై –సంభ్రమం చోటుచేసుకుంది. "ప్రమోషనా? నీకా? నిజంగానా? నన్నుడికించాలనా?"

"నిజంగానే. బ్రాంచి మేనేజర్గా...చాలా హోదా పెరుగుతుంది!"

"అద్సరే....డబ్బు! ఎంత పెరుగుతుందేమిటి జీతం?" అన్నది ముఖం వెలిగిపోగా.

"దాదాపు వెయ్యి రూపాయల దాకా పెరగొచ్చు." అని చెల్లెలు రాసిన ఉత్తరం చదవుకోసాగాడు.

కాంతమ్మకి ఆనందంతో కాళ్ళూ– చేతులూ ఆడటంలేదు. ఇంతగొప్ప వార్త నమ్మ శక్యం కావటంలేదు ఒక్కసారిగా తాను ఎంతో ఎత్తుకు ఎదిగినట్లు ఉక్కిరి బిక్కిరైంది. గబగబా పేరట్లో-కెళ్ళి ప్రక్కింటావిడను కేకేసి చెప్పింది సంబరంగా. పిల్లలకి చెప్పింది. అయినా తృప్తిగాలేదు. మళ్ళీ మొగుడి దగ్గరకొచ్చి కూర్చుంది.

"ఇదిగో కాంతం! మొన్ననడిగావే లక్ష్మీనర్సు ఎందుకొచ్చిందీ? అని. ఎందుకొచ్చిందీ అంటే..."

"ఎందుకో అందుకు. అవునూ... ప్రమోషన్ అన్నారుగదా... ఆఫీసరంత హోదా.. వుంటుందా?".

"వుండొచ్చు. అద్సరే... రేణు ఏం చేసిందో తెలుసా?"

"ఏదో చేసిందిలెస్తూ. హోదాగా ఉండాలంటే ఈ కొంపలో ఎట్లా కుదురుతుంది? మరో మంచి ఇల్లు చూసుకోవద్దూ?"

"ఇల్లా ఆసలీ పూరులోంచే మకాం మార్చాలి. అయినా ఈ కాలం పిల్లల కింత సినిమా మోజులేమిటో చూడు. దాని ఈడుకి అది ఏకంగా హీరోయిన్ కావాలని...."

"దాని గొడవకేంగానీ– ఏ వూరు వెళ్ళాలి మనం?"

"విజయవాడ. పాపం లక్ష్మీనర్సు ఎంత దిగులు పడిందో... ఆ రోజున ఈ ముక్క చెప్పాలనే.."

"ముందు నువ్వా పాతబట్టలు పారేసి– కొత్తవి కుట్టించుకో. హోదాగా వుండొద్దూ? నాలుగు కర్చీలు– ఓ టేబిలు తీసుకోవాలి. ఇంకా చాలా సామాను తీసుకోవాలి మనం."

"చూద్దాం. రేణు తిరిగొచ్చాక మా బావ ఏమన్నాడో రాసింది చూశావా? ఆయనకంత కోపం రావటం సహజమేగానీ– అల్లరిపడితే ఎవరికి నష్టం? ఎట్లాగయినా ఆయనకు ఆలోచన తక్కువ. అర్భకుడు."

"వాళ్ల తిప్పలు వాళ్ళవి... మన సంగతి నేను చెప్పేది. ఇదుగో ముందే చెప్తున్నా– నాకు నల్లపూసల గొలుసు చేయించాలి. ఎనాళ్లనుంచో మోజు. ఇక తప్పదు.!"

"చూద్దాం రేణుకి పెళ్ళవటం కష్టం కదూ... నలుగురి దృష్టిలో ఇట్లా బైట పడింది. ఎవరు చేసుకుంటారు దాన్ని.?"

"మేనమామవిగా. నువ్వుగాని చేసుకోవాలను కావటంలేదుకదా? జామునుంచీ చూస్తున్నాను. వాళ్ల గురించి తప్ప మన సంగతి పట్టించుకోరేం? ఏం మనిషివయ్యా? సంతోషం కూడా అనుభవించటం చేతగాని వాడికి రేపా మేనేజర్గా ఎట్లా పని చేస్తావంట?"

కాంతమ్మకు కోపం వచ్చింది.

రామానుజం మౌనంగా పడకుర్చీలో మేను-వాల్చాడు.

కాంతమ్మ ఏదో అంటూనే వుంది.

నెమ్మదిగా కళ్ళు నిద్రతో బరువెక్కి మూసుకు పోసాగాయి.

ప్రమోషన్ ఆర్డర్ చేతికొచ్చింది. కొంత ఎడ్వాన్స్గా డబ్బిచ్చారు.

ఆఫీసులో పార్టీ అది ముగిశాక ఇంటికొచ్చాడు రామానుజం.

స్నానంచేసి ముస్తాబయి అతనికోసం ఎదురు చూస్తున్నట్టు వుంది కాంతమ్మ.

"ఎవరింట్లో పేరంటం?" అనడిగాడు.

"పేరంటమూలేదు– బుగ్గీలేదు!"

"సినిమాకా? టైం దాటి పోలేదూ?"

"పోదురూ!.. బడాయి" కోపం, సిగ్గు అభినయించింది.

"సెకండ్ షోకా? ప్రక్కింటావిడతో నేనా?"

"కాదని చెప్తుంటే మీక్కాదూ? పూరికేనే. అయినా... నేనింకా గుమాస్తా పెళ్ళాన్నా ఏమిటి? చింకి బట్టలు కట్టుకునే రోజులు పోయాయి. నా అదృష్టం తిరిగింది!" అన్నది నవ్వుతూ ప్రసన్నంగా.

రామానుజంకి మతిపోయినంత పనయింది.

తను మరో ఇంటికి పొరబడి రాలేదుకదా? అను-కున్నాడు.

ఇది తన ఇల్లే. ఇరుగో పిల్లలు. అవును.. కొత్తగా కాంతం 'మీరు' అంటూ ఈమన్నన ఏమిటి? వేషం, భాష అంతా మారి పోయిందే!

"ఇదిగో ఈ ఉప్మా తిని– కాఫీ తాగండి. కాసేపు అట్లా పడకుర్చీలో కూర్చుని రెస్టు తీసుకోండి! ఈలోగా వేన్నీళ్ళు బాత్ రూంలో పెడతాను!

కాంతమ్మ మర్యాదలకి రామానుజం బుర్ర మొద్దు-బారిపోయింది.

ఉప్మా తిని కాఫీ తాగాడు. రోజూ రాత్రిళ్ళు చన్నీళ్ళు స్నానం చేస్తాడు. ఆ అలవాటుకి భిన్నంగా ఈ రోజు వేన్నీళ్ళు స్నానంచేసి రాగానే చలువచేసి వున్న లుంగీ – బనీను తీసి వుంచింది సిద్ధంగా

'తన దశ తిరిగింది!' అనుకున్నాడు కాస్త గర్వంగా. 'అవును. తను ఇంకా గుమాస్తా రామానుజం కాదుగా! మేనేజర్ రామానుజరావు. అనుకున్నాడు. ఆ అనుకోవడంలో ఎంతో తృప్తి– ఆనందం.

'రోజూ చూసే ఇల్లయినా ఈ రోజు ఎంత మార్పు! ఇక నుంచీ ఇంటా– బయటా గౌరవం, వంక-దణ్ణాలు... నిజంగా పదవిలోనే వుంది కదా పర-మార్థం. 'నిధి చాలా సుఖమా?– రాముని సన్నిధి చాలా సుఖమా?' అని ఆ పిచ్చి త్యాగరాజు మీమాంసలో పడ్డాడు గానీ– మరో మానవుడైతే అమాంతం ఆ నిధిని కావలించుకోడూ?... ఆ నిధి లేకనేగా– ఇంట్లో చులకన– బయట లోకువ... కుక్కకంటే హీనంగా బ్రతకటం...' రామానుజం ఆలోచిస్తూనే వున్నాడు.

చిన్నవాళ్ళిద్దరూ దేనికో కొట్లాడుకుంటే గబగబా కాంతమ్మ వెళ్ళి "ఏంటా వెధవగోల? నోర్మూసుకోండి! అవతల నాన్నగారు రెస్టు తీసుకుంటున్నారు." అని మందలిస్తోంది.

రామానుజం నవ్వుకున్నాడు. సుమతీశతకకారుని పద్యం గుర్తొచ్చింది

'గడన గల మగని జూచిన- అడు గడుగుకు మడుగులొత్తు...

ఆహా! ఎంత అనుభవశాలి ఆ మహానుభావుడు...."

రాత్రి భోజనంలో కొసరి కొసరి తినిపించింది. మంచం వాల్చి పక్క వేసింది. తన పని ముగించుకువచ్చి- మొగుడి కాళ్ళు పట్టసాగింది.

"అబ్బె... నాకేం నొప్పిలేవు. వదులు కాంతం!" అంటూ మొహమాటపడి పోయాడు రామానుజం.

"చాల్లెస్తురూ. పొద్దుననగా వెళ్ళి- ఆ పాడు ఆఫీసు నుంచి నడిచొచ్చి... నీకు తెలీదూ?అయినా. . ఇంకా ఎన్నాళ్ళులే. ఓ స్కూటరు కొనుక్కుంటే..."

రామానుజం కాంతమ్మ ప్రేమలో ఉక్కిరి బిక్కిరైనాడు. ఆ రాత్రి నిద్ర రాలేదు దగ్గరకు.

8

కొత్త వూళ్ళో- కొత్త ఇంట్లో- కొత్త పదవిలో రామానుజం క్రమ క్రమంగా స్థిర పడసాగాడు. రామానుజానికి ఆఫీసువాళ్ళే స్కూటరు- ఫర్నిచరూ ఇచ్చారు. ఇంటికి ఫోనొచ్చింది. అతని క్రింద ఆరుగురు గుమాస్తాలు ఇద్దరు టైపిస్టులు... ఎక్కడ చూసినా మర్యాదా- మన్ననా.. డబ్బుకు సంబంధించిన చికాకులన్నీ తొలగి పోయినయ్.

క్రొత్తగా తెరచిన బ్రాంచీ కావటంవల్ల పని వొత్తిడి ఎక్కువగానే వుంటోంది. ఆఫీసు పనితో అలిసి ఇదివరకు లాగానే రాత్రి తొమ్మిది గంటలకే ఇంటికి వస్తున్నాడు. అయినా కాంతమ్మ ఏమీ అనటంలేదు. పైగా అలసిపోయాడని సపర్యలు చేస్తోంది కూడా. అంతా బాగానే వుంది. అన్నీ వున్నాయి. అయినా రామానుజానికి మనశ్శాంతి వుండటంలేదు. అసహనం, చిరాకు పెరిగిపోయాయి విపరీతంగా. రాత్రిళ్ళు అస్సలు నిద్రపట్టటంలేదు.

ఆర్నెల్ల క్రిందటి రామానుజానికి ఇప్పటి రామానుజానికీ పోలికేలేదు. చిక్కిపోయి బక్కగా తయారైనాడు. జుట్టంతా రాలిపోయి పిడతలా తయారైంది తల.

కాంతమ్మ అతనికి రోజూ హార్లిక్స్- విటమిన్ టాబ్లెట్లు, టానిక్కులూ, పళ్ళు బలవంతంగా తినిపిస్తోంది. డాక్టర్ దగ్గర కెళితే- బలహీనత తప్ప ఏం రోగం లేదన్నాడు.

కాంతమ్మకి లక్ష్మీనర్సు గుర్తుకొచ్చింది. 'ఖర్మ, ఇది వీళ్ళకి వంశ పారంపర్య జబ్బుకాదు గదా! డబ్బు చూడగానే ఇట్లా పీనుగుల్లా తయారవటం ఏమిటి?' అనుకున్నది- దిగులుగా.

మరింత శ్రద్ధగా అతనికిష్టమైన కూరలు చేసి పెడ్తోంది. టైం ప్రకారం అన్నీ సమకూరుస్తోంది. అయినా ప్రయోజనం కన్పించటంలేదు. రోజు రోజుకి మరింత దిగజారి పోతున్నాడు. ఇది వరకులా ఆఫీసు పని మీద కూడా శ్రద్ధ చూపలేక పోతున్నాడు. మనసంతా ఏదో వెలితి. దిగులు... అమూల్యమైనదేదో పోగొట్టుకున్నట్టు శూన్యత. ఎందుకిట్లా? రామానుజం ఎంత ఆలోచించుకున్నా తెలీటంలేదు. చిరాకు- విసుగు ఎక్కువై ఆఫీసులో స్టాఫ్ మీద- ఇంట్లో భార్య మీద కూడా మండి పడ్తున్నాడు.

కాంతమ్మ - భర్త పరిస్థితి అర్థం చేసుకున్న దానిలా ఓర్పుగా భరిస్తోంది అన్నీ. ముక్కోటి దేవతలకూ ముడుపులు కట్టింది. పేరు పేరునా మొక్కింది. తన మొగుడికి వెనుకటి ఆరోగ్యం ఇవ్వమని.

*　　　*　　　*

ఆ రోజు ఆఫీసు నుంచి వస్తూనే ఎంతో చిరాకుగా వున్నాడు రామానుజం. ఇంట్లోకి రాగానే టేప్ రికార్డర్‌ని ఇష్టం వచ్చినట్టు నొక్కుతున్న చంటిదాని మీద పడింది దృష్టి.

"ఇది కాస్త నాశనం చేస్తావుటే పాడు ముండా!" అంటూ దాన్ని గబగబా నాలుగంటించాడు.

ఓ ప్రక్కగా కూర్చుని ఇంగ్లీష్ మేగజైన్‌లోంచి బొమ్మల్ని కత్తిరిస్తున్న రెండో వాడ్ని చూసి "నీకు బుద్ధి లేదురా పుండాకోర్. ఇట్లా చింపి తగలేస్తావా? ఇది కొంపకాదు నరకం" అన్నాడు పళ్ళు కొరుకుతూ- రెండు తగల్నిచ్చి.

ఇద్దరూ యుగళగీతం మొదలెట్టారు.

ఈ హడావుడికి కాంతమ్మ పరిగెత్తుకొచ్చింది.

"ఏం చేశారండీ వాళ్ళు... ఎందుకట్లా అరచి హైరాన పడ్తారు?" అన్నది నచ్చ చెప్ప బోతున్నట్టుగా.

"నీ పిండాకూడు. ఏం చేస్తున్నావు కొంపలో? వీళ్ళిద్దరూ వస్తువుల్ని తగలేస్తుంటే చూడనక్కర్లా?"

"పోనిద్దురూ. చిన్న పిల్లలు. అలిసినట్టున్నారు. హాయిగా స్నానంచేసిరండి! వేడిగా దోసెలువేసి ఇస్తాను." అన్నది ఆప్యాయతతో.

ప్రకృతి-వికృతి

ఎదిగే చెట్టు
చెరువలోని
మొక్కను
గొడుగును
ఎదగనివ్వదు
ఇది ప్రకృతి
పెరిగే మనిషి
అక్కున ఉన్న
మనిషిని
టోపీ వేసి
ఎదగనివ్వడు
ఇది వికృతి

— సి. వి. సర్వేశ్వర శర్మ

"నీ ముఖం తగలేసిరి. తిండి కోసం ఎవడేడ్చి చస్తున్నారు.? నువ్వే తిను అన్నీ. అన్నాడు మండి పడుతూ.

కాంతమ్మ కొళ్ళు మండింది. అయినా సహనంగా- "నేనూ తింటాను. మీరు కూడా తినండి. పోనీ ఇద్దరం సరదాగా తిందామా?" అన్నది.

"నీ సరదా మండినట్లే వుంది! నన్నట్టే విసిగించకు. అవతలికి ఫో.

"ఏమయింది మీకు? ఎందుకింత చిరాకు? వంట్లో ఎట్లా వుంది?

"ఏదో అయింది. పిచ్చెత్తినట్టుగా వుంది. నాకేమయిందో నాకే తెలీటంలేదు. ఆఫీసులో పనికూడా తగలెట్టేశాను. నిన్ను చూసినప్పుడు నాలుగు తన్నాలనిపిస్తుంది. నీ మాటలు వింటుంటే పీక పిసుగుదామనిపిస్తుంది. ఈ కొంప ఒక నరకం. మీరంతా రాక్షసులు అన్పిస్తుంది. రాత్రిళ్ళు నిద్రపట్టిచావదు. ఏదో అయింది నాకు. పెద్దగా అరవాలనుకున్నాడు. గొంతు పెగలలేదు.

"మాట్లాడరేం? మిమ్మల్నే!"

"నోర్మూసుకుని లోపలికి ఫో- వెధవ సొద." అన్నాడు. ఛీదరింపుగా.

"పోతాన్లెండి... ముందు మీరు కోటువిప్పండి!"- అంటూ అతని దగ్గరగా వెళ్ళి కోటు విప్ప బోయింది. అవసరం లేదన్నట్టుగా ఒక్కసారిగా విదిలించుకున్నాడు. ఆమడ దూరానకెళ్ళి పడింది. ఆ విసురుకు కాంతమ్మ అప్పటిదాకా ఆమెలో వున్న సహనం ఎగిరిపోయింది.

"ప్రమోషన్ వచ్చినప్పటి నుంచి చూస్తున్నాను. నన్ను పురుక్కుంటే హీనంగా చూస్తునావ్! ఏమిటయ్యా నీ గొప్ప? బోడి ప్రమోషనూ నువ్వూను. నీ పెత్తనం ఆఫీసులో చూపించు. నా దగ్గరకాదు. పోనీలే అని చూస్తున్నకొద్దీ నీ పిచ్చి ముదిరిపోతుంది. ఇంకా బోడి కోపం చాలించి నోర్మూసుకూర్చో. నీ మొహానికి మర్యాద.. మన్నన ఇవ్వటం నాదే బుద్ధి తక్కువ..." అన్నది మండిపడుతూ.

రామానుజంలో హటాత్తుగా ఏదో రిలీఫ్ కలుగ సాగింది.

"చాల్లే... వెధవ్వాగుడూ నువ్వూనూ!" అన్నాడు ఉత్సాహంగా.

"నాది వెధవ్వాగుడా? అమ్మో... అమ్మో... ఎన్నేసి మాటలు పడుతున్నాను. ఎంత లోకువై పోయాను! నీకీ పాడు రోగమేమిటయ్యా? లక్షణంగా కాపురం చేసే పెళ్ళాన్ని పట్టుకుని...."

కాంతమ్మలోని వెనుకటి కాంతమ్మలేచి కళ్ళెర్ర చేసింది.

రామానుజంలోని అశాంతి, వెలితికి కారణం తెలిసింది. అతని మనసు దూది పింజలా తేలికై- కళ్ళు అరమూతలు పడసాగినయ్. ఆ తర్వాత మరో పది నిముషాలకు- చాలాకాలం తర్వాత సుఖనిద్ర పోయాడు. □